# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-05-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో భాగంగా ఈరోజు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమవుతారు.**
2. **తెలంగాణ ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి ఈ రోజు సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారు.**
3. **సహజంగా పెరిగిన మొక్కలు జీవవైవిధ్యానికి తోడ్పడతాయని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ తెలిపారు.**
4. **ఆంధ్రప్రదేశ్ లో 4 విమానాశ్రయాలను త్వరలో ప్రారంభిస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు వెల్లడించారు.**
5. **రబీ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీలో పర్యటిస్తున్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా గత రాత్రి ఢిల్లీ చేరుకున్న ఆయన కేంద్ర హోంమంత్రి అమిత్ షా పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమవుతారు. రాష్ట్రానికి సంబంధించిన పలు ప్రాజెక్టులు, కేంద్ర పథకాలపై మంత్రులతో చర్చించి సహకారం కోరనున్నారు. నూతన నేర చట్టాల అమలు తీరుతెన్నులపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా నిర్వహించే సమీక్షకు చంద్రబాబు నాయుడు హాజరవుతారు.

అలాగే రేపు నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశంలో కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొంటారు. ఈ సమావేశంలో రాష్ట్రానికి సంబంధించి వివిధ అంశాలను ముఖ్యమంత్రి ప్రస్తావించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

---------------------------

తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి ఈ రోజు సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలో పర్యటిస్తారు. హైదరాబాద్ నుంచి జహీరాబాద్‌కు చేరుకుని హుగ్గెల్లి చౌరస్తాలో ఏర్పాటు చేసిన బసవేశ్వర విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. అలాగే మాచునూరులో కేంద్రీయ విద్యాలయం భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం పస్తాపూర్ చేరుకుని, అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభ ప్రాంగణంలో 494.67 కోట్ల రూపాయలతో చేపట్టే

వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. తర్వాత అక్కడ నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారు. ఈ కార్యక్రమం అనంతరం సాయంత్రం హైదరాబాద్ నుంచి ముఖ్యమంత్రి ఢిల్లీకి బయలు దేరి వెళ్తారని అధికారులు తెలిపారు.

---------------------------

సహజంగా పెరిగిన మొక్కలు జీవవైవిధ్యానికి తోడ్పడతాయని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ తెలిపారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన జీవవైవిధ్య దినోత్సవ వేడుకల్లో ఆయన నిన్న పాల్గొన్నారు. ప్రజలు ప్రకృతితో మమేకం అయ్యేందుకు విరివిగా మొక్కలు నాటాలని ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కోరుతూ,

వాయిస్ ..29 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం, నెల్లూరు, కుప్పం, అమరావతిల్లో విమానాశ్రయాలను త్వరలో ప్రారంభిస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు వెల్లడించారు. శ్రీకాకుళంలో జరిగిన పార్లమెంట్ స్థాయి మినీ మహానాడు కార్యక్రమంలో ఆయన నిన్న మాట్లాడుతూ, ఐదేళ్లలో దేశవ్యాప్తంగా 50 కొత్త విమానాశ్రయాలు నిర్మిస్తామని తెలిపారు. ఇప్పటికే కొన్ని ప్రారంభం కాగా, మరికొన్నింటికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో మరో మూడు చోట్ల విమానాశ్రయాలను ఏర్పాటు చేసేందుకు పరిశీలిస్తున్నామని చెప్పారు.

---------------------------

అమృత్ భారత్ పథకం కింద దేశవ్యాప్తంగా 103 రైల్వే స్టేషన్లను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృశ్యమాధ్యమం ద్వారా నిన్న ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ లోని తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో రైల్వే స్టేషన్ ను ప్రజలకు అంకితం చేశారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్టేషన్ ను అభివృద్ధి చేయడం ఈ ప్రాంతానికి ఎంతగానో ఉపయోగపడుతుందని స్థానికులు కిరణ్ కుమార్ తెలుపుతూ,

వాయిస్..29 సెకన్లు

---------------------------

ఆపరేషన్ సిందూర్ విజయానికి మద్దతుగా, భారత సైనికుల పరాక్రమానికి దేశం గౌరవ వందనంను తెలుపుతోంది. సాయుధ దళాలకు సంఘీభావంగా, ఆకాశవాణి వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. ఇందులో భాగంగా భారత్–పాక్ యుద్ధంలో అత్యున్నత త్యాగం చేసిన పరమ వీర చక్ర ఫ్లయింగ్ ఆఫీసర్ నిర్మల్ జిత్ సింగ్ సెఖోన్‌ను గురించి ఈ రోజు తెలుసుకుందాం.

వాయిస్ .. 35 సెకన్లు

---------------------------

రబీ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ పౌరసరఫరాలశాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. రబీలో కొనుగోలు చేసిన ధాన్యం గణాంకాలపై మంత్రి నిన్న ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ రబీ సీజన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం 60.61 లక్షల టన్నులు ధాన్యం సేకరించిందనీ.. గతంతో పోలిస్తే దాదాపు 24 లక్షల టన్నులు అధికమని వివరించారు. వర్షాలతో తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్ మనసులోని మాట” కార్యక్రమం 122వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 117800 నెంబర్‌కు ఈ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఈ నెల 27 నాటికి అల్పపీడనం ఏర్పడే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రానున్న 3 రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో  తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. కాగా ఈ రోజు రాష్ట్రంలోనిఅల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని, అలాగే మిగతా జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది.

మరోవైపు తెలంగాణలోనూ  ఈదురుగాలులతో కూడిన భారీ నుంచి అతి భారీ వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

జూన్ 2వ తేదీన ఐదు లక్షల మంది యువతకు రాజీవ్ యువ వికాసం పథకం మంజూరు పత్రాలను అందజేస్తామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్‌లోని బేగంపేటలో రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో ఆయన నిన్న  పాల్గొని మాట్లాడారు. బ్యాంకు అధికారులు 2025-26 వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు.  రాజీవ్ యువ వికాస పథకంలో 6 వేల 250 కోట్ల రూపాయలను రాయితీ రూపంలో ప్రభుత్వం ఇవ్వనుందని చెప్పారు. రానున్న ఐదేళ్లలో మహిళా సంఘాలకు లక్ష కోట్లకు పైగా వడ్డీ లేని రుణాలు ఇవ్వాలన్నదే  ప్రభుత్వం లక్ష్యమని వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో అన్న క్యాంటీన్ల ద్వారా ప్రజలకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పురపాలక కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన 202వ అన్నక్యాంటీన్‌ను ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 5 రూపాయలతో ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనాన్ని  అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోనూ  ఈ క్యాంటీన్లను ఏర్పాటు చేస్తామని మంత్రి తెలుపుతూ,

వాయిస్ .. 29 సెకన్లు

---------------------------

వేసవి నీటి అవసరాల దృష్ట్యా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నుంచి కృష్ణా నది యాజమాన్య బోర్డు నీటి కేటాయింపులు చేసింది. ఆంధ్రప్రదేశ్ కు 4 టీఎంసీలు, తెలంగాణకు 10.26 టీఎంసీలు కేటాయిస్తూ  ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

=====================